క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చక్రస్నానం



అభిషేకానంతర అలంకారంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : తిరుమలేశుని తొలిగడపగా భావించే దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి క్షేత్రంలో శనివారం శ్రీ చక్ర స్నానం కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ద్వాదశిని పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత స్వామిని తిరుచ్చిపై కొలువుదీర్చి ఊరేగింపుగా మేళతాళాల మధ్య పుష్కరిణి వద్దకు చేర్చారు. అర్చక బృందం దేవతా మూర్తులను అక్కడి మండపంలో కొలువుదీర్చి విశేష అభిషేకాలు నిర్వహించి పుష్కరిణిలో మునకలు వేయించారు. అనంతరం మండపం లో విశేష అలంకారం చేసి తిరిగి ఊరేగింపుగా భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయానికి చేర్చారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వెంకటేశ్వర్లుకు డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్ : వైవీయూ పీజీ కళాశాల అప్లైడ్ మ్యాథమ్యాటిక్స్ స్కాలర్ ఆవుల వెంకటేశ్వర్లుకు యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్ ను ప్రకటించింది. అప్లైడ్ మ్యాథమెటిక్స్ విభాగ సహ ఆచార్యులు డాక్టర్ ఎస్. సునీత పర్యవేక్షణలో ' థిరిటికల్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ద క్యారెక్టర్ స్టిక్స్ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఆన్ వేరియస్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్స్ ఓవర్ ఏ స్ఫేర్ బై యూజింగ్ స్టాటిస్టికల్ టూల్స్ 'అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం విశ్వ విద్యాలయానికి సమర్పించారు. ఆవుల వెంకటేశ్వర్లు కు డాక్టరేట్ సర్టిఫికెట్‌ను వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కెఎస్వీ కృష్ణారావు జారీ చేశారు.

హోమియోపతి వైద్యుడు బదిలీ



డాక్టర్ జవహర్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా లక్ష్మి పురం హోమియోపతి మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ ఎస్.జవహర్ రెడ్డిని నియమిస్తూ ఆయుష్ కమిషనర్ డాక్టర్ మంజుల డి.హోస్మాని ఉత్తర్వులు జారీ చేశారు. జవహర్ రెడ్డి కడపలోని హోమియోపతి వైద్యులుగా పనిచేస్తూ లక్ష్మిపురానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు పరిసర ప్రాంత ప్రజలకు కూడా మెరుగైన హోమియోపతి వైద్య సేవలను అందిస్తామన్నారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి



వడ్డె ఓబన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డీసీసీ బ్యాంకు డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప

కడప అగ్రికల్చర్ : భారతదేశ తొలితరం స్వాతంత్ర్య వీరుడు వడ్డె ఓబన్న అని డీసీసీ బ్యాంకు డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప అన్నారు. ఓబన్న 217వ జయంతిని శనివారం కడప డీసీసీ బ్యాంకులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వడ్డే ఓబన్న నిరుపమానమైన దేశభక్తిని గుర్తించి ఏపీ ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు కడప చీఫ్ మేనేజర్లు టివి సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, మేనేజర్ నారాయణ రెడ్డి, ఆంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా విష్ణువు కల్యాణం



కల్యాణోత్సవంలో వేద పండితులు, భక్తులు

రామాపురం : మండలంలోని కంభరాయుడి గుట్టపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణువు ఆలయంలో స్వామి వారి కల్యాణ వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య కమనీయంగా సాగింది. అనంతరం మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసనం, మహా కుంబాభిషేకం, రుద్రాభిషేకం, పుష్కరిణిలో సుదర్శన చక్ర తళ్వార్, చక్రస్నానం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహకులు ముక్కోటి బసిరెడ్డి, రామాంజుల్‌రెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి సతీ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పదపదవే వయ్యారి గాలిపటమా..!

కడప కల్చరల్ : సంక్రాంతి సంబరాలలో గాలిపటం ఎగురవేయడం ముఖ్యమైనది. మన ప్రాంతంలో అంతగా ఈ వేడుక కనిపించకపోయినా పండుగ సంప్రదాయాలలో ఒకటిగా వస్తుంది గనుక అక్కడక్కడ గాలిపటాలు ఎగురవేస్తారు. గాలిపటం అనగానే బాల్యం గుర్తుకొస్తుంది. పతంగుల పండుగగా పేరొందిన సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

సంక్రాంతి అంటే జారుతున్న లూజు నిక్కర్లను ఎగబట్టుకుంటూ మిగతా వారి కంటే తన గాలి పటాన్ని చాలా ఎత్తుగా ఎగరేయాలని అటు, ఇటు తీసిన పరుగులుకూడా గుర్తొస్తాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా రెండు, మూడు వారాలపాటు అక్కడక్కడ చిన్నారులు, యువకులు గాలిపటాలు ఎగురవేస్తూ ఆనందిస్తారు. ఈ పండుగ సంప్రదాయాలలో గాలిపటాలు ముఖ్యమైనవిగా భావిస్తారు. కడప నగరంలో చిన్నారులు మైదానాల్లో సాయంత్రాలు గాలి పటాలు ఎగురవేస్తూ ఆనందిస్తున్నారు. వీరి కోసం మార్కెట్లలో దాదాపు 50 రకాల ఆకర్షణీయమైన రంగులు, బొమ్మలతో గాలిపటాలను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. రూ. 5 నుంచి రూ. 150 ఖరీదు చేసే గాలిపటాలు నగరంలోని బీకేఎం వీధిలోని ప్రముఖ ఫ్యాన్సీ స్టోర్‌లలో



విక్రయానికి సిద్ధంగా గాలిపటాలు

లభిస్తున్నాయి. వీటిలో బాహుబలి గాలిపటాలు మూడేళ్లుగా కొనసాగుతున్నాయి. ఈ సంవత్సరం ప్రత్యేకతగా మోడీ–యోగిల ఫోటోలు గల గాలిపటాలు, శ్రీరాముని చిత్రం, అయోధ్య బాలరాముడు చిత్రాలతో పతంగులు మార్కెట్‌లో ఆకర్షిస్తున్నాయి. ఇటీవల హిట్ అయిన కల్కి సినిమా బొమ్మలతో కూడా గాలి పటాలు మార్కెట్‌లో ఉన్నాయి. ఇలాంటి వాటికి యువత నుంచి మంచి డిమాండ్ ఉంది. గుజరాత్‌లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా వారం రోజులపాటు కైట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని శిల్పారామాల్లో కూడా ఈ సందర్భంగా



గాలిపటంతో చిన్నారి

పతంగుల పోటీ నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి గాలి పటాలను ఎగరేసేందుకు రెండు, మూడు రకాల దారం ఉండలు కూడా స్థానిక దుకాణాల్లో విక్రయిస్తున్నారు. మొత్తానికి ఈ సీజన్‌లో గాలిపటాల వ్యాపారం జోరుగానే సాగుతోంది.

విలువలు పెంచేలా విద్యార్థులకు పోటీలు

కడప కల్చరల్ : నేటి విద్యార్థుల్లో విలువలు పెంచేందుకు వేమన, బద్దెన తదితర కవుల పద్యాల గురించి వారికి పోటీలు నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 8, 9 తేదీల్లో కడప నగరంలో సంస్థ పక్షాన రచయితల మహాసభలను నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా విద్యార్థుల్లో విలువలు, సాహిత్య, భాష అభిలాష పెంచేందుకు పద్యపఠన పోటీలను నిర్వహించామన్నారు. బాలోత్సవం నిర్వాహకులు, సంస్థ అధ్యక్షులు బి.గోపాల్, ప్రధాన కార్యదర్శి ఆర్.రాహుల్, బాల యల్లారెడ్డి ఆధ్వర్యంలో శనివారం బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పోటీలను నిర్వహించారు. విజేతలకు రచయితల మహాసభల్లో రూ. 2000, రూ. 1500, రూ. 1000 నగదు



పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తామన్నారు. డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి, గౌరీ శంకర్, రాజారెడ్డి, గంగిరెడ్డి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయులు వీర సుదర్శన్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక కడప విభాగం అధ్యక్షులు శివరామ కృష్ణారెడ్డి, సభ్యులు మధుసూదన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నీట్ విద్యార్థులకు ఆర్థికసాయం

రామాపురం : మెడిసిన్, ఇంజినీరింగ్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు టివి.సత్యమయ్య తెలిపారు. స్థానిక నీలకంట్రావుపేటలోని సద్గురు దర్గా మాతాజీ గంగిశెట్టి రంగనాయకమ్మ ఎడ్యుకేషనల్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏడాదికి రూ.10వేల చొప్పున నాలుగేళ్లకు ఆర్థికసాయం చేస్తారన్నారు. ఈ నెల 20న ర్యాంకు కార్డు, అడ్మిషన్ స్లిప్, ఆధార్‌కార్డుతో రావాలని, మరిన్ని వివరాలకు సెల్ నెంబరు 94414 02901కు సంప్రదించాలని తెలియజేశారు.

రేపు తాళ భజన పోటీలు

వల్లూరు : దుగ్గాయపల్లెలోని శ్రీ సీతారామాలయంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 7:30 గంటల నుంచి తాళ భజన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన భజన బృందాలకు మొదటి బహుమతి రూ.15 వేలు, రెండవ.. రూ.10 వేలు, మూడవ.. రూ.5 వేలు, నాలుగవ.. రూ.3 వేలు, ఐదవ.. రూ.2 వేలు అందించ నున్నట్లు తెలిపారు. ఆసక్తి గల భజన బృందాల వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



రూట నాయకులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ అదితిసింగ్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి కృష్ణ కిషోర్



ఏపీటీఎఫ్ నాయకులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ రూట నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రూట చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ నేమ్ బోర్డును రాష్ట్ర రెండో అధికార భాష ఉర్దూలో కూడా రాయించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌ను కోరారు. రాష్ట్ర కన్వీనర్ బెపారి ఫక్రుద్దీన్ మాట్లాడుతూ రూట సంఘం గత 35 సంవత్సరాలుగా రాష్ట్రంలోని ఉర్దూ విద్యాసంస్థల అభివృద్ధికి సేవలందిస్తున్నదని అన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, జుబేర్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అఫ్జల్ బాష, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ అయ్యూబ్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయడానికి ఉపాధ్యాయులంతా కలిసి కట్టుగా కృషి చేయాలని డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) 2025 డైరీ, క్యాలెండర్లు, జీఓల సంపుటిని శనివారం కడప డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి, సంఘ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చాపాడు మండల విద్యాశాఖాధికారులు రవిశంకర్, వంశీక్రిష్ణ, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, లక్ష్మి నారాయణరెడ్డి, జయసింహారెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లాకౌన్సిలర్లు హేమాంబుర్ రెడ్డీ, శ్రీధర్, క్రిష్ణయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ జనవరి 12వ తేదీ స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో తయారు చేసిన 2025 క్యాలెండర్‌లను జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి కృష్ణ కిషోర్, నెహ్రు యువ కేంద్ర జిల్లా అధికారి మణికంఠ చేతుల మీదుగా విడుదల చేశారు.

ఇంటెలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడిగా..



నాయబ్‌రసూల్

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామానికి చెందిన షేక్ నాయబ్ రసూల్‌ను అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ ఇంటెలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడిగా నియమిస్తూ వైఎస్ఆర్‌సీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రసూల్ సంతోషం వ్యక్తం చేశారు.

ఏపీజీబీ తరలింపు అన్యాయం

వల్లూరు : కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించడం అన్యాయమని, తరలింపు ఆపకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 12 తేదీ కడపలోని ఐఎంఏ హాల్‌లో సెమినార్ నిర్వహిస్తున్నామని, దీనికి కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి శైలజా నాథ్‌తో బాటు ఎమ్మెల్సీలు, సిపిఐ, సీపీఎం, ఆర్‌సీపీ నాయకులు పాల్గొననున్నారని, ప్రజలు విజయవంతం చేయాలని అన్నారు. సెమినార్‌కు సంభందించిన కరపత్రాలను శనివారం ఆయన వల్లూరు మండలంలోని వివిధ వ ర్గాల ప్రజలకు పంచి పెట్టారు.

అంతా అపరిశుభ్రం

కలెక్టరేట్ కార్యాలయం ఆవరణం అంతా అపరిశుభ్రంగా ఉంది. మురుగు కాలువల నిండా ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు నిండిపోయాయి. పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటిని తొలగించేవారే లేరు. ఇక ఫుట్‌పాత్ అస్తవ్యస్తంగా మారింది. కలెక్టరేట్‌లోని సభా భవనం ఎదురుగా గుంతలమయమైన రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప





ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



కలెక్టరేట్‌లో కాలువల నిండా వాడి పడేసిన వాటర్ బాటిళ్లు



కలెక్టరేట్‌లో అస్తవస్తంగా ఉన్న ఫుట్‌పాత్



కలెక్టరేట్‌లోని సభా భవనం ఎదురుగా గుంతలమయమైన రోడ్డు

భక్తిశ్రద్ధలతో శని త్రయోదశి

కడప కల్చరల్ : శని త్రయోదశి సందర్భంగా శనివారం కడప నగరంలోని శనీశ్వరస్వామి ఆలయంతోపాటు ఆలయ ప్రాంగణాలలో నవగ్రహాల వద్ద విశేష పూజలు నిర్వహించారు. కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో నవగ్రహాల వద్దగల శనీశ్వరస్వామికి ప్రత్యేకంగా తైలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక భక్తులు మొక్కులు తీర్చుకోవడంలో భాగంగా నల్లటి నువ్వులు ముడి వేసి స్వామికి సమర్పించి పూజలు చేశారు. మరికొందరు నువ్వుల నూనెతో అభిషేకించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌లు కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

■ స్థానిక రామకృష్ణనగర్‌లోని శ్రీ సాయి శనీశ్వర స్వామి ఆలయంలో శనీశ్వరస్వామికి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి స్వామికి నువ్వుల నూనెతో ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. హాజరైన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రామకృష్ణనగర్‌లో విశేష అలంకారంలో శనీశ్వరస్వామి

శిల్పారామంలో ముగ్గుల పోటీ



పోటీలో బహుమతి పొందిన ముగ్గు



ముగ్గుల పోటీలో విజేతలుగా నిలిచిన మహిళలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శనివారం మహిళలకు ముగ్గుల పోటీని ఆహ్లాదభరితమైన వాతావరణంలో నిర్వహించారు. శిల్పారామం పాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీకి దాదాపు 40 మంది మహిళలు హాజరయ్యారు. మహిళలు తమ కళా ప్రతిభను చాటుకుని కళ్లు చెదిరేలా రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. న్యాయ నిర్ణేతలు రాఘవేంద్రవర్మ, తనూజలు ఆకర్షణీయమైన ముగ్గులను ఎంపిక చేసి విజేతలను నిర్ణయించారు. మొదటి బహుమతిగా జి.రమ్యారెడ్డికి రూ. 5 వేలు, ద్వితీయ బహుమతి సాధించిన కె.సుప్రజకు రూ. 3 వేలు, తృతీయ బహుమతిగా జి.సునీతకు రూ. 2 వేలు మన్‌మందిర్‌షాపింగ్ మాల్ సహకారంతో అందజేశారు. వీరితోపాటు పది మందికి ప్రత్యేక బహుమతులు, మరో 20 మందికి ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేసి విజేతలను అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : 16 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించి రాష్ట్ర ప్రభుత్వం పెర్ఫార్మెన్స్ ఆధారంగా జీతాలు ఇచ్చే విధానానికి స్వస్తి చెప్పి రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జీ.వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసి.బాదుల్లా విజ్ఞప్తి చేశారు. శనివారం ఎస్టీయూ కార్యాలయంలో మెప్మా ఆర్పీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రగతి, బీఎల్‌ఓ డ్యూటీలు, మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించడం, స్త్రీ నిధి ఇలా అనేక రకాల పనులు ప్రభుత్వం మెప్మా ఆర్పీలతో చేయిస్తోందన్నారు. కేవలం రూ.6 వేలతో కుటుంబాన్ని ఎలా పోషించాలని ప్రశ్నించారు. ఆర్పీలందరికీ రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన డ్రస్ కోడ్ అమలు చేయాలని, వేతనాలు ప్రభుత్వం వ్యక్తిగత ఖాతాలలో జమ చేయాలని, ఆర్పీలందరికీ గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఆర్పీలకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు తక్షణమే విడుదల చేయాలని, చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పీ.సుబ్బారాయుడు, ఆర్పిలు బీబి,శ్రీదేవి, విజయలక్ష్మి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

మెప్మా ఆర్పీల అసోసియేషన్ ఎన్నిక..

జిల్లా మెప్మా ఆర్పీల గౌరవ అధ్యక్షుడిగా కేసీ.బాదుల్లా, అధ్యక్షురాలుగా డి.సుజాత, ప్రధాన కార్యదర్శిగా యన్. విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా బి.చంద్రకళను ఎన్నుకున్నారు.

బాలోత్సవ్ నిర్వహణకు సన్నాహాలు

కడప కల్చరల్ : బాలోత్సవం సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో సెయింట్ జోసెఫ్ బాలుర పాఠశాలలో పిల్లల పండుగ బాలోత్సవ్‌ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సంస్థ అధ్యక్షులు జి.గోపాల్ తెలిపారు. శనివారం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ మేరకు కార్యక్రమాల పోస్టర్లను విడుదల చేశారు. గౌరవ అధ్యక్షులు నాగమునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రాహుల్ మాట్లాడుతూ బాలోత్సవ్ పండుగ పిల్లలకు ఆటవిడుపు కావడమే కాకుండా గొప్ప అనుభూతి ఇస్తుందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఇది రెండవసారి నిర్వహిస్తున్న పిల్లల పండుగ అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి, సభ్యులు బాల యల్లారెడ్డి, సత్యనారాయణ, కార్యదర్శులు లక్ష్మిరాజా, వెంకట సుబ్బయ్య, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, యల్లేశ్వరరావు, శివరాం, అరుణ, వెంకటేశ్వర్లు, సుందరయ్య, మధుసూదన్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాలోత్సవ్ నిర్వాహకులు

జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా 15వ మహాసభలు ఈనెల 25, 26వ తేదీన బద్వేల్ పట్టణంలో జరుగుతున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి దస్తగిరి, వి గంగా సురేష్ కోరారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల సందర్భంగా ఈనెల 25న బద్వేల్ పట్టణంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని, జాతీయస్థాయి ఉద్యోగ పరీక్షలు తెలుగులో నిర్వహించాలని వీటితోపాటు కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు నాగార్జున, శివ, చంద్ర, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఉపాధ్యాయులే.. సమాజానికి మూల స్తంభాలు

రాజంపేట : ఉపాధ్యాయులే.. సమాజానికి మూలస్తంభాలు అని అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ చొప్పాగంగిరెడ్డి అన్నారు. ఏయూ అనుబంధసంస్థ అన్నమాచార్య బీఈడీ కాలేజీలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బోధిస్తూనే, పదోన్నతి దిశగా విద్య అభ్యసించడం అభినందనీయం అన్నారు. ఏఐటీఎస్ వైస్ చైర్మెన్ చొప్పాఎల్లారెడ్డి మాట్లాడుతూ సమాజానికి నాణ్యమైన ఉపాధ్యాయులను అందించడంలో అన్నమాచార్య యూనవర్సిటీ ముందంజలో ఉంటుందన్నారు. అన్నమాచార్య బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ డా.జయరామిరెడ్డి మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అంబేడ్కర్ ఓపెన్ యూనవర్సిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులను నిర్వహించామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు బ్రోచర్లను అందజేశారు. చొప్పా అభిషేక్‌రెడ్డి, పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలుకు బ్రోచర్ అందజేస్తున్న చొప్పా గంగిరెడ్డి

అందరి సహకారంతో ఉత్సవాలు

ఏఐటీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను అందరి సహకారంతో నిర్వహించగలిగామని అన్నమాచార్య యూనివర్సిటీ ఛాన్సలర్ చొప్పాగంగిరెడ్డి, ప్రో ఛాన్సలర్ చొప్పాఅభిషేక్‌రెడ్డి, ఏఐటీఎస్ వైస్ చైర్మెన్ చొప్పా ఎల్లారెడ్డి పేర్కొన్నారు.